
# సత్యవాక్యం


# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**FEBRUARY - 2005**

T E J A T V




M A A T V

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్‌లో**

(కాకినాడలో మాత్రమే) ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 ఫిబ్రవరి 2005 సంచిక 7


## బాప్తిస్మమును గూర్చిన కొన్ని ప్రశ్నలు

(Some Questions about Baptism)

దేనినైనా ఒక అంశమును గూర్చి పరిశోధించునప్పుడు సత్యమును తెలుసుకొనుటకు సాధారణముగా మనము కొన్ని ప్రశ్నల నడుగుదుము. బాప్తిస్మము అను అంశమును గూర్చిన సత్యమును సంపూర్తిగ తెలుసుకొనుటకు కొన్ని ప్రశ్నలను మనము అడుగుచూ వాటికి జవాబులను బైబిలును గ్రంథము నుండి కనుగొందము.

బాప్తిస్మము అనగా యేమిటి? దానిని ఎందునిమిత్తము ఎవరు ఎప్పుడు ఎక్కడ, ఏలాగున తీసికొనవలెను? అను ప్రశ్నలకు జవాబులను మనము కనుగొన గలిగితే ఈ అంశముపై నున్న సత్యమును మనందరము తెలుసుకొనగలము. సరిగదా అది గొప్ప ఆత్మీయ మేలును మనకు కల్గించును అని నా విశ్వాసము.

బాప్తిస్మమును గూర్చి ప్రజల మనసులలో గొప్ప గందరగోళము ఈనాడున్నది.

అనేకులు అనేక రకాలుగా దీనిని బోధించుట వలన అట్టి సందర్భ మేర్పడినది. మానవ జాతిని విమోచించు విధానములో దేవుడు బాప్తిస్మమును ఆజ్ఞాపించెను అని మనము ఇదివరకే గమనించి యుంటిమి. గనుక బాప్తిస్మము అను ప్రాముఖ్యాంశమును మనము తెలుసుకొనుట మంచిది.

**బాప్తిస్మమనగా యేమిటి?** బాప్తిస్మము అనునది ఒక తెలుగు పదము కాదు. అది "బాప్తిస్మ" లేక "బాప్టిజో" అను గ్రీకు పదము నుండి వచ్చినది. గ్రీకు భాషలో దానికి ముంచుట, పాతిపెట్టుట యని అర్థము. గనుక సూక్ష్మంగా మనము చెప్పుకొనాలంటే బాప్తిస్మమనగా నీళ్ళలో ముంచుట లేక పాతిపెట్టుట యని అర్థము. దీని విషయమై మనము మన ఊహాపరిజ్ఞానాన్ని వినియోగించనవుసరం లేకుండగానే రోమా 6:4లో అపొ.పౌలు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై క్రీస్తుతో కూడ పాతిపెట్టబడితిమి అని చెప్పుచున్నాడు."మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" యని కొలస్స 2:12లో అతడు మరల చెప్పుచున్నాడు.

బాప్తిస్మమను క్రియలో యేసుక్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానములను క్రియలు మనకు సాదృశ్యముగా కన్పడవలెనని దేవుడు ఉద్దేశించెను. ఒకడు తన పాపముల విషయమై చచ్చినవాడై, నీటిలో ముంచబడి, లేచుట ద్వారా అట్టిది సాధ్యమగుచున్నది అని రోమా 6:3-5లో అపొ.పౌలు బోధించు చున్నాడు.

బాప్తిస్మమనగా సమాధియని, పాతిపెట్టబడుట యని దేవుని వాక్యము చెప్పుచుండగా అనేకులు దైవ వాక్యమునకు వ్యతిరేకముగా నడుచుకొనుచున్నారు. బాప్తిస్మము నీళ్ళలో ముంచుటయే. ముంచడములోనే క్రీస్తుతో కూడ పాతిపెట్టబడుటకు గాని, లేపబడుటకుగాని ఏదైనా సాదృశ్యమున్నది. ఇట్టి వాక్యరీతిగ యున్న బాప్తిస్మమునకు బదులు కొందరు చిలకరింపును అవలంబించుచున్నారు. అయితే చిలకరింపు, కుమ్మరింపు అనునవి బాప్తిస్మము ఎన్నడును కానేరవు. చిలకరింపు, కుమ్మరింపులలో యేసుక్రీస్తు యొక్క సమాధి, పునరుత్థానముల సాదృశ్యము ఏమియును లేదు. అందులో ఏరకమైన పాతిపెట్టబడుట జరుగదు; తిరిగి లేచుట అంతకుమందే జరుగదు. గనుక అవి బాప్తిస్మము కాదు.

చిలకరింపు, కుమ్మరింపు అనునవి బాప్తిస్మము కాని యెడల అవి సంఘము లోనికి ఎట్లు ప్రవేశపెట్టబడెను? అవి దేవునిచే మాత్రము ప్రవేశపెట్టబడలేదు. అట్లయిన వాటి విషయమై దేవుని వాక్యము మనకు తప్పక బోధించియే యుండును గదా. క్రొత్తనిబంధన అంతయు సంపూర్తిగ లిఖింపబడిన తరువాత, అపొస్తలులందరు మరణించిన తరువాత రెండవ శతాబ్దములో ముంచుటకు బదులు చిలకరించుట గాని, కుమ్మరించుట గాని చేయవచ్చునని ఎవరో ఒక మానవుడు తలంచెను. అయితే ఆనాటి క్రైస్తవులు ఆ తలంపును ఎదుర్కొని ఖండించుట జరిగినది. గ్రీకు భాషలో చిలక రింపు "రేంటీజో" అను పదము నుండి వచ్చినది. బాప్తిస్మము విషయములో గ్రీకు క్రొత్త నిబంధనలో ఆమాట ఎన్నడూ వినియోగింపబడనే లేదు.

అయితే క్రీ॥శ॥ 1321 సం॥లో రావెన్నలో జరిగిన సభలో రోమన్ కేథలిక్ వారు చిలకరింపును, కుమ్మరింపును బాప్తిస్మమునకు బదులుగా ప్రవేశపెట్టిరి. క్రీస్తు తన సంఘమును స్థాపించిన 1300 సంవత్సరముల తరువాత రోమన్ కేథలిక్కు వారు బాప్తిస్మమును చిలకరింపు, కుమ్మరింపుగా మార్చివేసిరి. అయితే సత్యమేమంటే బాప్తిస్మము అనగా నీటిలో ముంచుటయే గాని, తలమీద కొన్ని నీటి చుక్కలు చిలకరించుట ఎన్నటికినీ కాదు. మానవులు ఎన్ని క్రొత్త సిద్ధాంతములను ప్రవేశపెట్టినను దేవుని వాక్యమును మాత్రము మార్చలేరు గదా!

బాప్తిస్మమును ఎందు నిమిత్తము పొందవలెను? అనునది మన రెండవ ప్రశ్న: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింప బడును" అని యేసు చెప్పెను (మార్కు 16:16). పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను అని పేతురు అపొ.కా. 2:38లో చెప్పెను. బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది యని 1 పేతురు 3:21 చెప్పుచున్నది. దేవుని రాజ్యములో ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెను అని యోహాను 3:3-5 చెప్పుచున్నది. పరిశుద్ధాత్మ అను వరమును పొందుటకు, క్రీస్తులో ప్రవేశించుటకు, నీ పాపములను కడుగుకొనుటకు బాప్తిస్మము పొందవలెను (అపొ.కా. 2:38; గలతీ 3:27; అపొ.కా. 22:16). ఈ వాక్యములను బట్టి మనము ఎటుచూచినను, రక్షణ పొందుటకు బాప్తిస్మము అత్యవసరమని గోచరమగు చున్నది.

అయితే బాప్తిస్మమును ఎవరు పొందవలెను? అనునది మన మూడవ ప్రశ్న:

బైబిలు నందెక్కడను వయోపరిమితి ఈ విషయంలో వ్రాయబడలేదు. అయితే ఇన్ని సంవత్సరములు వచ్చినవారు బాప్తిస్మము పొందవలెను అని చెప్పుటకంటే ఎట్టివారు బాప్తిస్మమునకు అర్హులో అది బోధించుచున్నది. నమ్మినవారు బాప్తిస్మము పొందవలెను అని యేసు చెప్పెను. ఐతియోపీయుడైన నపుంసకుడు ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని ఫిలిప్పునడుగగా, అందుకు ఫిలిప్పు నీవు విశ్వసించిన యెడల పొందవచ్చును అని చెప్పెను. అందుకు నపుంసకుడు నేను యేసునందు విశ్వాసముంచుచున్నాను అని ఒప్పుకొనెను. అప్పుడు ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. పెంతెకోస్తు పండుగ దినమున పేతురు సువార్తను బోధించగా దానిని వినిన యూదులు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని అతడు వారికి చెప్పెను.

దీనిని బట్టి మనము ఏమి గ్రహించుకొనుచున్నాము? ఎవరైనను బాప్తిస్మము పొందవలెనంటే అట్టివారు యేసునందు విశ్వాసముంచవలెను, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను, తమ విశ్వాసమును ఒప్పుకొనవలెను అని సులభముగా గ్రహించుకొనుచున్నాము. అట్లయినపుడు మనకు ఇంకొక ప్రశ్న ఉద్భవింపవచ్చును. పసిబిడ్డలు యేసునందు విశ్వాసముంచగలరా? పసిబిడ్డలు పాపముల విషయమై మారుమనస్సు పొందగలరా? పసిబిడ్డలు ఒప్పుకొనగలరా? ఆ ప్రశ్నలకు జవాబును మనం ఇట్టే గ్రహింపగలము గదా. పసిబిడ్డలు అట్టి వాటిని ఏమియు చేయలేరు. అందువలన వాక్య ప్రకారము వారికి ఎవరును బాప్తిస్మ మియ్యలేరు. నిజానికి పసిబిడ్డలు బాప్తిస్మము పొందనవసరము లేదు. వారు పాపము చేయనందున, నశించిపోవు స్థితిలో వారు లేరు. సరిగదా పరలోక రాజ్యము అట్టివారిదేనని యేసు బోధించెను (మత్త 19:14). తల్లితండ్రుల పాపమును వారి బిడ్డలెవరూ వారసత్వము వలన పొందరు అని యెహెజ్కేలు 18:20 బోధించుచున్నది.

క్రొత్తనిబంధలో బాప్తిస్మము పొందిన వారిని గూర్చి అనేకసార్లు వ్రాయబడెను గాని పసిబిడ్డలను గూర్చి అందెన్నడు వ్రాయ బడలేదు."వాక్యమును వినిన వారిలో అనేకులు నమ్మిరి. వారిలో పురుషుల సంఖ్య యించు మించు అయిదువేలు ఆయెను" అని అపొ.కా. 4:4 చెప్పుచున్నది. 5:14లో చూచిన "పురుషులును స్త్రీలును అనేకులు మరి యెక్కువగ విశ్వాసులై ప్రభువు పక్షమున చేర్చబడిరి" అని వ్రాయబడియున్నది. 8:12లో "అయితే ఫిలిప్పు దేవుని

రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతనిని నమ్మి, పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి" యని వ్రాయబడి యున్నది. మనము చూచిన ఈ వాక్యములలో పసిబిడ్డలెవరూ బాప్తిస్మము పొందినట్లు కన్పడుట లేదు. గనుక పసిబిడ్డలకు బాప్తిస్మమిచ్చు ఆచారము దేవుని అనుమతి బడసినదికాదు. అది మానవ కల్పిత సిద్ధాంతమే. క్రైస్తవ్యమును కలుషితము చేయుటకు దానిని ప్రవేశపెట్టిన వారు ఇంకెవరు, రోమన్ కేథలిక్కువారే.

పసిబిడ్డలు బాప్తిస్మము పొందనవుసరం లేని యెడల బాప్తిస్మము పొందవలెనంటే ఒకనికి ఎంత వయస్సుండవలెను? అని మీరడుగ వచ్చును. లేఖనములు ఎక్కడా వయస్సును నిర్ణయించలేదు గాని ఎవరయితే యేసు నందు విశ్వాసముంచి, పాపముల నిమిత్తమై మారుమనస్సు బొంది, వారి విశ్వాసమును ఒప్పుకొనవయస్సు వచ్చిన వారవుదురో అట్టివారు తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము, అనగా నీటిలో ముంచడము పొందవలెనని దేవుని వాక్యము బోధించు చున్నది.

బాప్తిస్మము ఎప్పుడు, ఎక్కడ పొందవలెనను ప్రశ్నలకు వచ్చే సంచికలో దైవవేదము నుండి జవాబును కనుగొందాము. ఈలోగా బాప్తిస్మమును గూర్చిన సత్యమును మీరు గ్రహించగల్గిన యెడల దేవుని ఆజ్ఞలకు విధేయులగుటకు మీరు వెనుకాడరనియే నా విశ్వాసము !!


క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళ వారం ఉదయం 6:30 గం॥లకు MAA టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు తేజ ఛానల్ లోను చూడండి

# అబ్రాహాము విశ్వాసము

## (Abrahamic Faith)

అబ్రాహాము విశ్వాసుల తండ్రియని పిలువబడ్డాడు. అపొ.పౌలు అబ్రాహామును ఎట్లు వర్ణించుచున్నాడో గమనించుము: "అబ్రాహాము దేవుని నమ్మెను, అది అతనికి నీతిగా ఎంచబడెను" (రోమా 4:3). అబ్రాహాము మన తండ్రి కావలెనంటే అబ్రాహాము కున్నట్టి విశ్వాసము మన కుండాలి. అయితే అబ్రాహాము యొక్క విశ్వాసము ఎట్టిది?

అబ్రాహాము దేవుని నమ్మెనని సూక్ష్మంగా రోమా 4:3లో చెప్పబడింది. అదే అబ్రాహాము యొక్క విశ్వాసము, అబ్రాహాము తను ఊరును, బంధువులను విడిచిపెట్టాలని దేవుడతనికి చెప్పినప్పుడు అతడు "విశ్వాసమును బట్టి ఆ పిలుపునకు లోబడి, తాను స్వాస్థ్యముగా పొందనై యున్న ప్రదేశమునకు బయలు వెళ్లెను. మరియు ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలు వెళ్లెను" (హెబ్రీ 11:8). దేవుడు చెప్పాడు. అబ్రాహాము దేవుని నమ్మాడు, మరియు దేవుడేమి చెప్పాడో దాన్ని చేసాడు; అంతే. అదే అబ్రాహాము విశ్వాసము. దేవుని నమ్ముకొనుట యంటే దేవుడు చెప్పిన దానిని విశ్వసించుట యని అర్థము.

అబ్రాహాము యొక్క విశ్వాసాన్ని వర్ణించే మరియొక గొప్ప సంఘటన అతని జీవితంలో మనకు కనబడుచున్నది. దేవుడు అబ్రాహాము కొక కుమారుని వాగ్దానం చేసాడు. ఆ కుమారుడు జన్మించాడు. మరియు "ఇస్సాకు వలన అయిన దియే నీ సంతాన మనబడునని" దేవుడతనికి ఆది కాండము 21:12లో వాగ్దానం చేసాడు. అయితే దాని తరువాత అధ్యాయంలో దేవుడు "నీకు ఒక్కడై యున్న నీ కుమారుని, అనగా నీవు ప్రేమించు ఇస్సాకును తీసికొని మోరియా దేశమునకు వెళ్లి అక్కడ నేను నీతో చెప్పబోవు పర్వతములలో ఒక దాని మీద దహనబలిగా అర్పించుమని" అబ్రాహాముకు చెప్పాడు (ఆది 22:2). అబ్రాహాము ఈ విషయంలో కూడా దేవునికి లోబడ్డాడు. చివరకు ఇస్సాకుకు బదులుగా ఒక పొట్టేలును అర్పించుమని దేవుడు చెప్పగా అతడట్లు చేసాడు (ఆది 22:12,13). అది అబ్రాహాము యొక్క విశ్వాసము. అతడు దేవునితో వాదించలేదు, ఆయనను ప్రశ్నించలేదు. "అబ్రాహాము

శోధింపబడి విశ్వాసమునుబట్టి ఇస్సాకును బలిగా అర్పించెను............ఆ అబ్రాహాము మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తి మంతుడని యెంచినవాడై, తన యేక కుమారుని అర్పించి, ఉపమాన రూపముగ అతనిని మృతులలో నుండి మరల పొందెను" (హెబ్రీ 11:17-19). దేవుడు తన వాగ్దానమును ఎట్లు నెరవేరుస్తాడో అబ్రాహాముకు తెలియక పోయినను, ఆయన తప్పక నెరవేరుస్తాడని అతడు నమ్మాడు!

మారుమనస్సును గూర్చిన వర్తమానము నీనెవె పట్టణస్థులకు యోనా ప్రకటించినప్పుడు కలిగిన ప్రతిఫలము ఆశ్చర్యకరమైనది. దుర్మార్గతలో యున్న ఆ పట్టణం మారుమనస్సు పొందినది! ఎందువలన? యోనా 3:4,5లో మనం ఇట్లు చదువగలము : "యోనా ఆ పట్టణములో ఒక దిన ప్రయాణమంత దూరము సంచరించుచు, ఇక నలువది దినములకు నీనెవె పట్టణము నాశనమగునని ప్రకటన చేయగా, నీనెవె పట్టణపు వారు, దేవుని యందు విశ్వాసముంచి ఉపవాస దినము చాటించి, ఘనులేమి అల్పులేమి అందరు గోనె పట్ట కట్టుకొనిరి". నీనెవె పట్టణస్థులు దేవుని యందు విశ్వాసముంచిరి. తుపానులో బద్దలైపోయిన ఓడలో యున్న నావికులతో పౌలు ఇట్లు చెప్పాడు : "అయ్యలారా, ధైర్యము తెచ్చుకొనుడి; నాతో దూత చెప్పిన ప్రకారము జరుగునని నేను దేవుని నమ్ముచున్నాను" (అపొ.కా. 27:25). అట్టి అబ్రాహాము విశ్వాసము.

అట్టి విశ్వాసము దేవుని మాటలను వినుట ద్వారా కలుగును. మన యిష్టమొచ్చిన వారి ఉపదేశములను వినుట వలన అబ్రాహాముకున్న విశ్వాసాన్ని మనం కలిగి యుండలేము. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారని" యేసు ప్రభువు ఒక మారు చెప్పారు (మత్త 15:7). వారి ఉపదేశము వ్యర్థమైనదిగనుక వారి విశ్వాసము వ్యర్థమైనది. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17). "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహా 20:31). అబ్రాహాము లాంటి విశ్వాసము మానవుని యిచ్ఛను బట్టి కలుగదు (2 పేతురు 1:20); అది మానవుని జ్ఞానమునుబట్టి కలుగదు. గాని అబ్రాహాము విశ్వాసము దేవుని వాక్యము వినుటవలన కలుగును. దేవుడు

మాట్లాడాడు. అబ్రాహాము విన్నాడు, విశ్వసించాడు. అది యిప్పటికీ అదే రీతిగా పని చేయుచున్నది.

రక్షించు విశ్వాసము యొక్క పద్ధతిని గూర్చి యేసు ఇట్లు చెప్పాడు : "నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు; అంత్య దినమున నేనువానిని లేపుదును. వారందరు దేవునిచేత బోధింపబడుదురు. గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" (యోహాను 6:44, 45). దేవుని వాక్యము బోధింపబడి నేర్చుకొన బడినప్పుడు మాత్రమే మనకు అబ్రాహాము యొక్క విశ్వాసము కలుగును.

అబ్రాహాము దేవుని నమ్మెను, అది అతనికి నీతిగా ఎంచబడెను అని చెప్పబడినది. అబ్రాహాము యొక్క విశ్వాసము నీతిగా ఎప్పుడు ఎంచబడింది? అతడు విధేయత చూపినప్పుడు. గనుక అబ్రాహాము విశ్వాసము విధేయత చూపు విశ్వాసము. మన విశ్వాసమెప్పుడు నీతిగా ఎంచబడుతుంది? అబ్రాహాము వలె మనము కూడ విధేయత చూపినప్పుడు. విశ్వాసమును బట్టి అబ్రాహాము దేవునికి లోబడ్డాడు. "కాబట్టి అబ్రాహాము దేవుని నమ్మెను, అది అతనికి నీతిగా ఎంచబడెను అను లేఖనము నెరవేర్చబడెను" (యాకోబు 2:23). దేవుడు చెప్పింది చేసే వరకు అబ్రాహాము విశ్వాసము అతనికి నీతిగా ఎంచబడలేదని గమనించుము. మన విషయంలో కూడ అది సత్యమే. మన నీతి యావత్తు మురికి గుడ్డలవలె యుంటాది (యెష 64:6). గాని దేవుని చిత్తమును జరిగించుటవలన అట్లు కాదు. నీతిగా ఎంచబడే విశ్వాసము దేవునికి లోబడతాది.

అబ్రాహాము విశ్వాసము మా కున్నదని చెప్పుకునేవారనేకులు నేడున్నారు, గాని వారు దేవుని మాటలను నిరాకరిస్తారు. అది అబ్రాహాము విశ్వాసము కాదు. ఇశ్రాయేలీయులు పాపము చేసినప్పుడు తాపకరమైన సర్పములు పంపబడ్డాయి. వారు దేవునికి మొర్ర పెట్టగా దేవుడొక యిత్తడి సర్పాన్ని విరుగుడుగా వారికిచ్చాడు (సంఖ్య 21 అధ్యా). ఆ యిత్తడి సర్పంలో యేమీ లేదుగాని దేవుడు చెప్పింది చేయుటలో అంతా యున్నది. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" యేసు ప్రభువు చెప్పారు. అబ్రాహాము విశ్వాసము కలిగినవాడు దానిని వెంటనే జరిగిస్తాడు. "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 2:41).

నీకు అబ్రాహాము లాంటి విశ్వాసమున్నదా?

- జాషువా గూటం

# రిబ్కా

(Rebekah, who lost what She Loved Most)

ఇస్సాకుకు నలుబది సంవత్సరముల వయస్సు. అతని తల్లియైన శారా మరణించి సుమారు మూడు సంవత్సరము లాయెను. అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకునకు తాను నివసించుచున్న దేశములోని ఒక కానాను స్త్రీని తీసికొనివచ్చి వివాహము చేయుటకు తన యింటిపెద్ద దాసుడైన ఎలియాజరుతో ప్రయాణము చేయించుకొనెను (ఆది.కా. 24:1-9). ఎలియాజరు తాను అబ్రాహాముకు చేసిన ప్రమాణ ప్రకారము ఇస్సాకునకు భార్యను తెచ్చుటకు బయలు దేరి అబ్రాహాము యొక్క బంధువులలో ఒకని కుమార్తెయైన రిబ్కాను తన ప్రార్ధనా ఫలితముగా కనుగొనెను.

1. రిబ్కా చాల చక్కనిది; ఆమె కన్యక. ఏ పురుషుడును ఆమెను కూడలేదు (ఆది.కా. 24:16). ఆమె యొక్క సౌందర్యమును బట్టి అనేకమంది ఆమెను భార్యగా చేసికొనుటకు ఆశించి యుందురు. రిబ్కాకు శరీర సౌందర్యము గలదు.

2. ఆతిధ్యమిచ్చే స్వభావము: (ఆది.కా. 24:18-20). ఆమె త్రాగమని చెప్పి త్వరగా తన కడవను చేతిమీదికి దించుకొని అతనికి దాహమిచ్చెను. ఒంటెలు త్రాగు మట్టుకు వాటికిని నీళ్లు చేదిపోసెను. అడిగిన దాని కంటె కూడ రిబ్కా అధికముగ వారి కొరకు చేసెను. రిబ్కా యొక్క ఆతిధ్యమిచ్చే స్వభావము, దయ, కనికరములను మనము తెలిసి కొనగలము.

3. ఆమె సోమరికాక, కష్టపడి పనిచేయునది (24:20). త్వరగా తన కడవ గాడిలో క్రుమ్మరించి తిరిగి చేదుటకు ఆ బావికి పురుగెత్తిపోయి అతని ఒంటెలన్నిటికి నీళ్లు చేదిపోసెను. చేయవలసిన దానికంటె అధికముగ పనిచేయు స్వభావము.

4. చురుకైన, ఉత్సాహము కలిగి వ్యక్తి రిబ్కా. ఆమె ఎన్నో సార్లు పరుగెత్తినట్లు మనము చూస్తాము. ఒంటెలకు నీళ్లు చేది పోయుటకు ఆమె ఎన్నోసార్లు పరుగెత్తెను. ఎలియేజరు వచ్చి నట్లు చెప్పుటకు తన యింటికి త్వరగా పరుగెత్తెను. తనకు కాబోయే భర్తయైన ఇస్సాకును ఎదుర్కొనుటకు ఆసక్తితో పరుగెత్తి వెళ్లెను.

5. నిర్ణయములను తీసికొనుటలో గొప్ప సాహసి. తన ప్రయాణమును గూర్చి

ఇస్సాకుకు భార్యను తెచ్చుటలో దేవుడు తనను నడిపించిన విధమును గూర్చి రిబ్కా యొక్క కుటుంబమునకు ఎలియేజరు వివరించినపుడు, ఆమె సోదరుడును, తల్లియు రిబ్కాను పిలిచి ఈ మనుష్యునితో వెళ్ళెదవా? అని అడిగినపుడు ఆమె జవాబు కొరకు అందరూ కనిపెట్టు చుండిరి (ఆది.కా. 24:58).

6. (24:59) ఆమె వెళ్ళెదననెను. తన స్వకీయులను స్వదేశమును విడచి, యెన్నడు చూడనట్టి ఎరుగనట్టి క్రొత్త జనాంగము లోనికి, క్రొత్త దేశమునకు, క్రొత్త వ్యక్తి దగ్గరకు వెళ్ళుట ద్వారా ఆమె జీవితపయనము ప్రారంభమాయెను. ఎలియాజరు చెప్పిన వివరణను ఆధారముగ చేసికొని రిబ్కా తన నిర్ణయమును తీసికొనుటలో దేవుని నడిపింపు ప్రకారము ఈ కార్యము జరిగెనని మనము గ్రహించగలము. కాబట్టి దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదు (మత్తయి 19:6).

## రిబ్కాకు దేవుని వాగ్దానము

ఆమె ఎలియాజరుతో కలిసి కనాను దేశమునకు బయలుదేరి వెళ్ళెను. వారు ఆ ప్రదేశమునకు సమీపించు చుండినపుడు పొలములో ధ్యానించుటకు బయలు దేరి వెళ్ళిన ఇస్సాకును కనుగొని అతడే తన యజమానుడని తెలిసికొని రిబ్కా పరుగెత్తి వెళ్ళి ఇస్సాకును కలసికొనెను. ఇస్సాకు ఆమెను ప్రేమించి తన భార్యగా ఆమెను పరిగ్రహించి తనతల్లిని గూర్చిన దుఃఖ నివారణ పొందెను. వారి వైవాహిక జీవితములో ఇరువది సంవత్సరములు గడచి నప్పటికిని వారికి సంతానము లేదు. తనకు ప్రథమ సంతానము కలుగక మునుపు దేవుడైన యెహోవా రిబ్కాతో రెండు జనపదములు ప్రత్యేకముగ నీ కడుపులో నుండి వచ్చును. పెద్దవాడు చిన్నవానికి దాసుడగునని చెప్పెను (ఆది.కా. 25:23). ఆమె ప్రసవదినములు నిండినపుడు ఏశావు ముందుగ బయటకు వచ్చెను, తరువాత యాకోబు పుట్టెను. వారు పెద్దవారైనపుడు ఏశావు వేటాడుటయందు నేర్పరియై అరణ్యవాసిగ యుండెను. యాకోబు సాధువై గుడారములలో నివసించు చుండెను. ఇస్సాకు ఏశావు తెచ్చిన వేట మాంసమును తినుచుండెను గనుక అతని ప్రేమించెను. రిబ్కా యాకోబును ప్రేమించెను. పెద్దవాడు చిన్నవానికి దాసుడగునని చెప్పిన దేవుని వాగ్దాన నెరవేర్పును గూర్చిన ఓర్పును కోల్పోయినదై రిబ్కా తన కుమారుడైన యాకోబును గూర్చి తన స్వంత ఆలోచనలు కలిగియుండెను.

దేవుని యొక్క వాగ్దాన నెరవేర్పు

విషయములో తన ఓర్పు నశించుటను బట్టి తన స్వంత చిత్తమును నెరవేర్చుకొనుటకు ఉద్యుక్తురాలైనందున తన ఆత్మీయ జీవితములో వెనుకకు దిగజారిపోయింది. (ఆది.కా. 25:29-34). కలగూర వంటకము కొరకు ఏశావు తన జ్యేష్ఠత్వమును యాకోబుకు అమ్మివేసినను తండ్రియైన ఇస్సాకు యొక్క దీవెన ఉంటేనే గాని దానికి విలువ లేదని గ్రహించినదై రిబ్కా తన చిన్న కుమారుడైన యాకోబును మోసముచే తండ్రి నుండి ఆ దీవెన సంపాదించుకొన గల్గునట్లు ప్రోత్సహించెను. తల్లి మాట ప్రకారము యాకోబు తండ్రియైన ఇస్సాకును మోసగించి, నేనే నీ పెద్ద కుమారుడైన ఏశావునని అబద్ధమాడి అన్నకు రావలసిన దీవెన తాను సంపాదించు కొనెను (ఆది.కా. 27:6-29). రిబ్కా దేవుని మాటలను నిర్లక్ష్యము చేసి తన స్వంత యిష్టప్రకారము చేసింది. గనుకనే సంతోషము, నెమ్మది ఆ గృహములో లేకుండ పోయింది.

తన భర్తయైన ఇస్సాకు యెడల కూడ రిబ్కా మనసు యధార్ధముగ లేదు. తన చిన్న కుమారునికి తండ్రిని మోసగించుటకు, అబద్ధమాడుటకు ఎంతో ప్రోత్సాహమిచ్చింది. భార్యాభర్తలు ఒకరి యెడల ఒకరికుండవలసిన ప్రేమానురాగములు, గౌరవము, బాధ్యత-యివి సన్నగిల్లినపుడు వారి సహవాసము కూడ అంత సంతృప్తికరముగా యుండదు. రిబ్కా తన భర్త ఇస్సాకును ఎంతో ప్రేమించింది. కాని అదే గృహములో వారు పెరిగి వృద్ధులైనపుడు ఇస్సాకు యెడల రిబ్కా ప్రేమ సన్నగిలింది. కాలమాన పరిస్థితులను బట్టి మానవుడు మారుట సహజమే. కాని దేవునితో సహవాసము చేసే వ్యక్తి తాను వయసునందు పెరుగుచున్న కొద్ది సాంఘికముగను, ఆత్మీయముగను ఎంతో సంతృప్తిని పొందుచు జయకరమైన జీవితమును జీవించగలడు. రిబ్కా దైవచిత్త ప్రకారము కాక తన స్వంత యిష్ట ప్రకారము తాను చేసిన పనులను బట్టి అందమైన రిబ్కా ఒక మోసకరమైన వృద్ధ స్త్రీగా మారింది (సామె 16:31). నెరసిన వెండ్రుకలు సొగసైన కిరీటము, అవి నీతి ప్రవర్తన గల వానికి కలిగి యుండును.

రిబ్కా పాపము వలన ఆ గృహములో దు:ఖము

1. రిబ్కా చేసిన మోసకార్యమును బట్టి ఇస్సాకు మిక్కుటముగ భయపడి గడగడ వణకెను (ఆది.కా. 27:33).

2. తన తల్లి తనను మోసగించుటకు తమ్ముని ప్రోత్సహించిన విధమును బట్టి ఏశావు ఇంకా యెక్కువ ద్వేషము పెంచు

కొని తండ్రికి కనాను కుమార్తెలు యిష్టురాండ్రు కారని గ్రహించినవాడై వెళ్ళి మరి కొందరు కనాను స్త్రీలను వివాహమాడెను (ఆది.కా. 28:8-9).

3. మిక్కిలి భయంకరమైన విషమ పరిస్థితులకు యాకోబు లోనైపోయెను (ఆది.కా. 27:41). తన తండ్రి యాకోబుకిచ్చిన దీవెన నిమిత్తము ఏశావు అతని మీద పగ బట్టెను, యాకోబును చంపెదనను కొనెను. ఈ విషయము రిబ్కా తెలిసికొని యాకోబుతో యిట్లు చెప్పెను: నీ అన్నయైన ఏశావు నిన్ను చంపెదననుకొను చున్నాడు. కాబట్టి నీ యన్న కోపము నీ మీద చల్లారువరకు, నీవు అతనికి చేసిన దానిని అతడు మరచువరకు హారానులోనున్న నా సహోదరుడైన లాబాను నొద్దకు పారిపోవుమని యాకోబుతో చెప్పెను (ఆది.కా. 27:42-45).

4. రిబ్కా చేసిన పాపఫలితముగ తన ప్రియ కుమారుడైన యాకోబు నుండి వేరు చేయబడెను. అరణ్య మార్గమున ఒంటరిగ ప్రయాణము చేయుటకు యాకోబును విడిచిపెట్టెను. ఆమె యాకోబును యెక్కువగ ప్రేమించెను గాని తిరిగి మరి యెన్నడును యాకోబును చూడలేదు. దేవుని చిత్తానుసారముగ కాక తమ స్వంత యిష్టమును నెరవేర్చుకొనువారి జీవితములలో ఈ విధముగనే అనేక దుఃఖములు, వేదనలు, బాధలు, అసంతృప్తి కలుగును.

రిబ్కా యొక్క అన్యాయము యాకోబు పాపము చేయుటకు దోహదము చేసెను. యాకోబు దేవునిపై కాక ప్రతి విషయమునకు తన తల్లిపైనే ఆధారపడి యుండేవాడు. తల్లియిచ్చిన సలహాలను బట్టి యాకోబు జీవిస్తూ యుండేవాడు. తల్లిదండ్రులు తమ బిడ్డలను సన్మార్గమున వర్తింపజేసే వారిగ యుండాలి. వారికి మంచి సలహాలు యివ్వాలి. దేవుని భయములో వారిని పెంచాలి, నడిపించాలి. రిబ్కావలె మోసము చేయుట, అబద్ధమాడుట బిడ్డలకు నేర్పకూడదు. యాకోబు ఒంటరిగ హృదయ భారముతో, వేదనతో తన తండ్రి యింటి నుండి బయలుదేరి వెళ్ళుచున్నాడు. హృదయములో తన తల్లి తనను తప్పు మార్గమున నడిపించెనెనెడి తలంపులు, తాను తన అన్నయెడల దేవుని సహవాసము కొరకు మనస్సు ఆశించింది (ఆది.కా. 28:2-21). రాయిని తలగడగ చేసుకొని అతడు పరుండెను. దేవుని సన్నిధిని ఆశ్రయించెను. దేవుని సేవించుటకు నిశ్చయించుకొనెను. మేలును పొందెను. రిబ్కాకు అసంతృప్తి, దుఃఖము, వేదన మిగిలెను. తన తల్లి నడిపించిన విధమును

బట్టి కాక దేవుని నాశ్రయించిన నందువలన యాకోబు జీవితము మారింది. పేరు మారింది. దేవుని దీవెనలు పొందగలిగాడు. ఇతరులకు యేలుకరముగ యాకోబు జీవించాడు.

✍ - లోటీ బెత్ హాట్స్

❦ ❦ ❦ ❦

సంక్షిప్త ప్రసంగము :

# విధవరాలి కానుక

(Widow's Mite)

**పరిచయము :**

1. బైబిలులో పేర్కొనబడిన విధవ రాండ్ర పరిశోధన ఆసక్తిగా యుండును సారెపతు (1 రాజులు 17:8-24) అన్న లూకా 2:36-38; నాయీను (లూకా 7:1-15); గ్రీకు భాష మాట్లాడు వారు (అ.కా. 6:1-6); తొందర పెట్టు విధవరాలు (లూకా 18:1-8); అనాధులు (1 తిమోతి 5:8).

2. ఈమె ఒక బీదవిధవరాలు. రెండు మాటలు గలవు. "PTOCHOS" ఏమి లేనిది; "PENES" సరిపోని సంపాదన కలది. ఇందు PTOCHOS అను పదము వాడబడినది.

3. ఈ పాఠము జరిగిన సమయము: క్రీస్తు మరణమునకు ముందు మంగళ వారము నాడు యేసు దేవాలయములో రూకలు మార్చువారి యెదుట స్త్రీల ఆవర ణలో జరిగినది. అక్కడ కానుకలకొరకు 13 పెట్టెలు కలవు. అందులో నాలుగు పెట్టెలు తమకు తామే యిచ్చు కానుకల పెట్టెలుగా సూచించబడినవి.

4. విధవరాలి రెండు కాసులు చాలా తప్పుగా అర్ధము చేసి కొనబడినది, తప్పుగా వర్తింపజేయబడినది.

**ముఖ్యాంశములు :**

**I. *క్రీస్తు మన అర్పణలను చూస్తున్నారు.***

A. దేవుడు క్రీస్తు సర్వాంతర్యాములు మనము చేయు ప్రతీపని వారు చూచుచున్నారు.

1. కీర్తనలు 139:7-10; 1పేతురు 3:12 మన ఆరాధనకును యిచ్చుటకును వర్తించును.

2. మన కానుకలను సహోదరుల

నుండి దాచవచ్చును. ప్రభుత్వము వారికి కనబడకుండ కూడా దాచవచ్చును. కాని క్రీస్తుకు కనబడకుండ దాచలేము.

3. దేవుడు కొర్నేలి దాతృత్వమును చూచినాడు (అ.కా. 10:2) అననీయ సప్పీరాల దురాశకూడ ఆయన చూచినాడు (అ.కా. 5:11).

B. మన యిచ్చుటను గురించి ప్రభువు ఏమి చూస్తున్నారు?

1. మనమిచ్చు సొమ్మును ఆయన చూచును, మన మిచ్చిన ప్రతిపైసా ఆయనకు తెలియును.

(a) క్రీస్తు ధనికులు యిచ్చిన పెద్ద కానుకలను విధవరాలు యిచ్చిన రెండు కాసులను చూచెను.

(b) యిచ్చిన కానుకలు అలవాటు ప్రకారము గాను, సమృద్ధిలో నుండియును లేక త్యాగముతోను యిచ్చినవై యున్నవి.

2. ఆయన హృదయవైఖరిని చూస్తున్నాడు. అపొ.కా. 1:24; యోహాను 2:24

(a) మనుష్యులు చూచుటకొరకు యియ్యబడినవి ఆయనకు తెలియును. మత్తయి 6:2-4.

(b) తమపైనున్న వత్తిడిని తప్పించుకొనుటకు ఈయబడినవి ఆయనకు తెలియును, II కొరింథీ 9:7.

(c) దేవుని యెడలను, మనుష్యుల యెడలను ప్రేమను వ్యక్తపరచుట కిచ్చినవి ఆయనకు తెలియును. పేద విధవరాలి కానుక.

C. మనం యిచ్చుటను దేవుడు చూచుటకు కారణములు.

1. మనపై వేగు చూచుటకు కాదు. నిందించుటకు కాదు. ఆయన సమ్మతి తెలియజేగుటకు.

2. సంపన్నత నధికము చేసుకొనుటకు కాదు కీర్తనలు 24:1.

3. ఇవి ఎందుకనగా యిచ్చుట మనకు ధన్యత. ఆయన మనయందు శ్రద్ధ కలిగియున్నారు.

**II. క్రీస్తు మన యిచ్చుటకు విలువ కట్టుచున్నారు.**

A. ఆయన మన కానుకలను పర్యవేక్షించుటలో వాటి విలువను అంచనా వేస్తున్నారు.

1. కానుకలు యిచ్చు వారిలోను వారి కానుకలలోను తారతమ్యము లున్నవని ఆయన గుర్తించినారు. ధనికులు -

పేదవారు: పైసలు - లక్షలకొద్ది ధనము : ఎక్కువ - తక్కువ : లేమి - కలిమి: సంపూర్ణముగా - కొద్దిగా.

2. కొన్ని కానుకలు మిగతా కానుకలంటె మంచివి అని ఆయన గుర్తించెను. విధవరాలి కానుక తతిమ్మా వాటి కంటె శ్రేష్టమైనది.

**B. ప్రభువు ఆయన బిడ్డల కానుకలకు విలువను కడుతున్నారు.**

1. కయీను - హేబెలు. ఆది 4:1-5; హెబ్రీ 11:4.

2. ఆమోసు కాలములోని యూదులు. ఆమోసు 5:21.

3. మలాకీ కాలములోని యూదులు. మలాకీ 1:7.

**C. కానుక విలువ కట్టుట**

1. ఇవి ఆధారములు కావు :

(a) మనమిచ్చు కానుకలు సద్వినియోగపరచబడుట, శాస్త్రులు, పరిసయ్యులు చందా డబ్బును దుర్వినియోగ పర్చెడి వారు - (మార్కు 12:40). పెద్దలు కొన్నిసార్లు చందా ధనమును సద్వినియోగ పర్చలేక పోవచ్చును. కాని మనము యివ్వకపోవుటకు యిది కారణము కాకూడదు.

(b) కానుక యొక్క విలువ, ఒక పైస అది ఎక్కువకాదు.

2. విలువ కట్టుటకు ఆధారములు :

(a) ఉద్దేశము : నిష్కపటమై యుండవలెను. (11 కొరింధి 8:8). దేవుని యెడలను మనుష్యుల యెడలను ప్రేమ.

(b) ఇవ్వబడిన విధము : ఇష్టముతోను సంతోషముతోను ఈయవలెను 11 కొరింధీ 9:7.

(c) కొలత : అది ధారాళముగా (రోమా 12:8) త్యాగముతో కూడినదై యుండవలెను.

3. ఇచ్చిన ధనముకన్న యిచ్చువాని శక్తి దేవునికి ముఖ్యము. చిన్న బహుమానమే దేవుని దృష్టిలో ఎక్కువ విలువ కలిగి యుండును. మత్తయి 10:43 (చిన్న పాత్రతో నీరు).

**III మన యిచ్చుటకు దేవుడు ప్రతిఫలము నిచ్చును.**

A. మన యిచ్చుటలో దేవుడు, క్రీస్తు కదలింపబడుదురు.

1. మంచివి, చెడ్డవియునైన మన కార్యములు పరలోకమును కదలించును -

లూకా 15:7; ఎఫెసీ 4:30.

2. ఎందుచేత మన యిచ్చుట దేవుని కదలించును?

(a) ఇది మన హృదయమునకు సూచికగా యున్నది. మత్తయి 6:21.

(b) ఇది మన కృతజ్ఞతను లేక మన కృతఘ్నతను తెలియచేయును. కృతజ్ఞులు అర్పణ లర్పించుదురు.

(c) దేవుని ఎంతమట్టుకు అంచనా వేస్తిమో తెలియ చేస్తుంది. మనము యెక్కువగా యిచ్చిన ఆయనను ఎక్కువగా ప్రేమించుట తెలియజేయుచున్నది.

3. మన యిచ్చుటలు ప్రభువును రెండు విధములుగ కదలించును. సంతోషించుట - దుఃఖించుట; అంగీకరించుట - తృణీకరించుట; ఆశీర్వదించుట - నాశన మొనర్చుట.

B. మన యిచ్చుటలు మనలను నాశనము చేయును.

1. యిచ్చుట కయీనుకు, యూదులకు, అననీయకు దుఃఖమును, నాశనమును కలుగజేసెను.

2. ధనము యెడల నున్న తప్పుడు ఉద్దేశము వీరి నాశనమునకు హేతువాయెను; ఆకాను, నాబాలు ఇస్కరి యోతు యూదా, గారడీవాడైన సీమోను, లవొదికయవారు.

C. మన యిచ్చుట మనలను అనేక విధములుగ ఆశీర్వదించును.

1. అంగీకారమైన అర్పణలకు ప్రతిఫలముగా దేవుడు అభినందనలు. ప్రేమ ఆశీర్వాదములు కురిపించును.

2. ఇహలోక జీవితములోను, రాబోవు జీవితములోను ఆయన మనలను ఆశీర్వదించును. మత్తయి 6:33; మార్కు 10:29; మలాకీ 3:10.

ముగింపు :

1. పేద విధవ రాలిని ఆమె కానుక విషయములో పనికి మాలిన కానుకగాను, ముందు ఆలోచన లేకుండ చేసినట్లుగాను, కొందరు మందలించుదురు. రెండు కాసులలో ఒక కాసును ఉంచుకొనవలసినదందురు. యేసు ఆమెను మందలించక ఆమెను ఆశీర్వదించినాడు.

2. మరియ - అత్తరుబుడ్డి యుదంతము (యోహాను 12:1-8) ఈ పాఠమునే బోధించుచున్నది. ఆమె యొక్క ధారాళత విమర్శించబడినది గాని ప్రభువు ఆమెను దీవించెను.

3. మనలను మనమే ప్రభువుకు సమర్పించుకొనిన మన అర్పణలు అంగీకారమైన వగును. గొప్ప ధారాళత గురించియే మన హృదయవాంఛలును, దేవునికి చేయు ప్రార్థన లునై యుండవలెను.

- యూజీన్ డబ్ల్యు. క్లైవెంజర్

# సువార్తికుడు తెలిసికోవలసిన పది సంగతులు

1. సువార్త పని నిత్యత్వంలో ప్రాముఖ్యమైనది. ప్రతి సువార్తికుడు తాను దైవ జనుడనని తలంచాలి. నశించుచున్న లోకానికి జీవముతో కూడిన నిరీక్షణ వర్తమానమును తాను కలిగి యున్నాడు. ఎంత ధన్యతయో! ఎంత బాధ్యతయో! ప్రతి క్రైస్తవుని పని ప్రాముఖ్యమైనది. మనకున్న తరుణములను ఆయన మహిమ కొరకు, యితరుల మేలు కొరకు ఉపయోగించాలని దేవుడు కోరుచున్నాడు. ఈ లోక యాత్రికులకు దేవుని వర్తమానమును నమ్మకమైన సువార్తికులు అందించాలి. మన వర్తమానము ప్రస్తుతమును, నిరంతరమును ఆనందదాయకమైనదే.

నశించుచున్న మానవుల హృదయంలోనికి ప్రకటన ద్వారా తన వర్తమానమును పంపుటకు దేవుడు ఎంచుకొన్నాడు. దేవుని సంకల్పమును ఎరుగని వారు, దేవుడే వర్తమానాన్ని నేరుగా మానవుల హృదయంలోనికి పంపియుంటే బావుండునను కొంటారు. లేదా ఆయన పరిశుద్ధాత్ముని గాని, దేవదూతలను గాని ఆ పనికి వినియోగించితే బాగుండునను కొంటారు. అయితే మంటి ఘటములను వినియో గించాలని దేవుని సంకల్పమైనట్టు 2 కొరింథీ 4:3-7లో స్పష్టము చేయబడినది. బోధ చేయుట ఎంత ప్రాముఖ్యమైనదో ఈ దిగువ లేఖనాలను బట్టి మనం గమనించు కోగలము. "సువార్త ప్రకటనయను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను"

(1 కొరింథీ 1:21). సువార్త ప్రకటన వలన దేవుని వాక్యము యుక్త కాలముల యందు బయలుపరచబడెను అని తీతు 1:3 చెప్పుచున్నది. సువార్త నమ్మువానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నది యని రోమా 1:16 చెప్పుచున్నది. రోమా 10:14లో ఈలాగు వ్రాయబడి యున్నది: "వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్ధన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు?......ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించు వారి పాదము లెంతో సుందరమైనవి యని వ్రాయబడి యున్నది". ఎంత గొప్ప భాగ్యమో ఎంత గొప్ప బాధ్యతయో!

ఆత్మల సంపాదనలో బోధకులు దేవుని జతపనివారు : "విత్తువాడును, కోయువాడును కూడ సంతోషించునట్లు కోయువాడు జీతము పుచ్చుకొని నిత్య జీవార్ధమైన ఫలము సమకూర్చుకొనుచున్నాడు" అని యేసు చెప్పెను (యోహాను 4:36). ప్రకటింపబడిన వాక్యము వలన మారుమనస్సు సంభవిస్తే పరలోకములో సంతోషము కలుగును. మారుమనస్సు పొందిన విశ్వాసులు బాప్తిస్మము పొందినప్పుడు వారికి సంతోషము కలుగును (అపొ.కా. 8:38-39; 16:33-34). పరలోకములో సంతోషము, రక్షింపబడిన వారి హృదయములలో సంతోషము, బోధకుని హృదయంలో సంతోషము! త్వరలో నిత్య సంతోషము !

## సువార్త ప్రకటన ప్రాముఖ్యత

దేవుని స్వరూపమున చేయబడిన మానవుల హృదయాలలో దేవుని వర్తమానము ముద్రింపబడుట వలన వారి జీవితములో ఇప్పుడు ఎల్లప్పుడు గొప్ప మేలు సంభవించును. దేవుని వర్తమానము వలన మానవుని జీవితం సాఫీగా నడుచును. దేవుని వాక్యమును ఉన్నది ఉన్నట్టుగా బోధించువారు ఈలోక యాత్రికులను సరియైన మార్గమున నడిపించగలరు.

బోధకుని పనివలన మానవుల నిత్య గమ్యము సులభతరమగును గనుక సువార్తికుని పని నిత్య ప్రాముఖ్యమైనది. ఈ లోక

ములో యున్న ప్రతివాడు కాలములో అతి వేగముగా నిత్య గమ్యమునకు పయనించు చున్నాడు. జీవితంలో రెండే మార్గాలు, గమ్యాలు వున్నట్లు యేసు బోధించారు. జీవమునకు పోవు ఇరుకు మార్గమును గూర్చియు, నాశనమునకు పోవు విశాల మార్గమును గూర్చియు ఆయన బోధించారు (మత్తయి 7:13-14). ప్రజలు పరలోకము నకు వెళ్లే మార్గమును తెలియ జెప్పే అవకాశమును బోధకులు కలిగి యున్నారు.

మనం సాధించిన దానిని గమనించి నప్పుడు, బోధకులమై నందుకు సంతోషింతుము. 42 సంవత్సరముల క్రితము నేను బాప్తిస్మమిచ్చిన ఇద్దరిని ఈ మధ్య కలిసికొన్నాను. "మీ సహాయము వలనే మేము పరలోక మార్గములో యున్నామని" వారు చెప్పారు. ఆ మాట వినగానే సువార్తికుడనైనందుకు సంతోషించితిని. మరి కొంతమంది ఈలాగ చెప్పారు : "మేము అనేక శోధనలలోను బాధలలోను యుండగా, మీరు దేవుని ప్రేమను మాకు చూపించారు. మా బాధలలో ఆయన సహాయం చేస్తారని చెప్పారు. ఆ మాటల వలన మేము ధైర్యముతో ముందుకు వెళ్లగలిగాము". ఇట్టి మాటలు వినగానే బోధకుడనైనందుకు నేనెంతగానో సంతోషించాను.

క్రీస్తు, ఆయన బోధలు ప్రజల జీవితాలలో వెలుగును ప్రసాదిస్తారు. పరలోకం వారి నిత్య గృహం అవుతాది : యేసు ఇట్లనెను : "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపువెలుగు కలిగి యుండును" (యోహాను 8:12). యేసు క్రీస్తు వలన మన జీవితాలు మెరుగుపడ్డాయి. గృహాలు ఆనంధ భరిత మవుతాయి, మరియు సుఖ దు:ఖాలలో దేవుని కృప మనకు తోడుగా ఉంటాది (రోమా 8:28-38). క్రైస్తవునిగా యుండుట గొప్ప భాగ్యము. "తన పరిచర్యకు నియమించి నమ్మకమైన వానిగా ఎంచినందుకు నన్ను బలపరచిన మన ప్రభువైన క్రీస్తు యేసుకు కృతజ్ఞుడను" అని పౌలు చెప్పెను. బోధకులమైతే పౌలు వలె మనము చెప్పగలము (1 తిమో 1:13).

✍ - చార్ల్స్ స్కాట్

(సశేషం)

# మీరు ఎవరి సంబంధులు?

| | | |
|---|---|---|
| ఆత్మ సంబంధులు | - | 1 కొరి 2 : 15, 3 : 1 |
| క్రీస్తు సంబంధులు | - | గలతీ 3 : 29, 5 : 24 |
| దేవుని సంబంధులు | - | 1 యోహాను 4 : 6 |
| వాగ్దాన సంబంధులు | - | రోమా 9 : 8 |
| వెలుగు సంబంధులు<br>పగటి సంబంధులు | - | 1 థెస్స 5 : 5 |
| శరీర సంబంధులు | - | 1 కొరింథి 3 : 3 |
| ప్రకృతి సంబంధులు | - | 1 కొరింధి 3 : 4 |
| లోక సంబంధులు | - | యోహాను 15 : 19 |
| అపవాది సంబంధులు | - | యోహాను 8 : 44 |
| దేహ సంబంధులు | - | రోమా 9 : 3 |
| ధర్మశాస్త్ర సంబంధులు | - | రోమా 4 : 14, గలతీ 5 : 10 |
| ఇశ్రాయేలు సంబంధులు | - | రోమా 9 : 6 |
| సున్నతి సంబంధులు | - | తీతు 1 : 10 |

మీరు బైబిలు చదువుచున్నారా? అది నమ్ముచున్నారా? అయితే మీరు దేని సంబంధులు? ఇట్లు వివిధ సంబంధులు ఉన్నారని బైబిలు చెప్పుచున్నందున అది అప్పటికి నిజమే

---

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# నీవు వినుచున్నావా?

(Are You Listening?)

నీవు హాజరైన బైబిలు తరగతులు ఎన్ని? వినిన ప్రసంగాలు ఎన్ని? వాటి నుండి ఏమైనా నేర్చుకొన్నావా? 2పేతురు 3:18లో చెప్పబడినట్లు మన ప్రభువైన యేసు కృపయందును జ్ఞానమందును నీవు పెరుగుచున్నావా? ఇదొక గొప్ప సవాలు! నీవు వినేది గ్రహించుకొనే లాగున దిగువ సంగతులను దయచేసి గమనించుము.

### నీ వేలాగు వినుచున్నావో గమనించుము

యేసు క్రీస్తు విత్తువాని ఉపమానము చెప్పిన తరువాత "మీరేలాగు వినుచున్నారో జాగ్రత్తగ చూచుకొనుడి" యని చెప్పారు (లూకా 8:18). మనమెట్లు వినుచున్నామో దానిపై మనం ఏరకమైన నేలయో నిర్ధారించ వచ్చును. ఎజ్రాయను శాస్త్రి మోషే ధర్మశాస్త్రమును చదువుటకు మొదలిడగా ఇశ్రాయేలీయు లందరు లేచి నిలువబడిరి (నెహెమ్యా 8:5). ఆరీతిగా వారు ఏకాభిప్రాయమును, దేవుని యెడల తమ భక్తిని ప్రదర్శించిరి. మనం కూడా ఈ లోకసంగతులను ఒక ప్రక్కన పెట్టి దేవుని వాక్యం కోసం వినుటయందు ఏకాగ్రత కలిగియుండాలి.

### సహృదయం కలిగి వినాలి

థెస్సలోనికయులు వారికి దేవుని వాక్యం బోధింపబడగా దాని దేవుని వాక్యం వలెనే అంగీకరించినందున పౌలు వారిని అభినందించాడు (1థెస్స 2:13). యిది బోధకులకు కూడ ఒక సవాలే. సమయమందును అసమయమందును వారు వాక్యాన్ని ప్రకటించాలి. వాక్యమును బట్టి ఖండించాలి. తప్పు దిద్దాలి. నీతియందు శిక్ష చేయాలి (2తిమో 4:2). అట్లు జరిగినప్పడు వినేవాడు దేవుని వాక్యమని దానిని వినాలి. బెరెయవారు ఒక మంచిమాదిరి. వారు వాక్యాన్ని శ్రద్ధాసక్తులతో విన్నారని అపొ.కా. 17:11 చెప్పచున్నవి.

### విశ్లేషించే మనస్సుతో వినాలి

బెరెయవారు పౌలు చెప్పచున్న మాటలు ఆలాగున ఉన్నవో లేవోయని లేఖనములను పరిశోధించుచు వచ్చిరి యని అపొ.కా. 17:11 చెప్పచున్నది. గనుక నీవు కూడ పరీక్షించు. నోట్సు వ్రాసుకో. యింటికి వెళ్లి బైబిలులో ఆలాగున ఉన్నదో లేదో పరీక్షించు. వచనాలను చూడు. అలాచేయుటలో రెండు సాధించ

వచ్చు. మొదటిగా ఆ వచనములో అట్లున్నదో లేదో తెలిసికోవచ్చు. రెండు, దేవుని వాక్య పఠనము వలన నీ విశ్వాసము బలపరచబడ్తాది.

**విధేయత స్వభావంతో వినాలి**

దేవుని వాక్యసత్యాన్ని నీ జీవితంలో అలవర్చుకొనుటకు సిద్ధపడు. దైవలేఖనము దైవావేశము వలన కలిగి తప్పు దిద్దుటకును, ఖండించుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది. నీవు వాక్యమును వినిన తరువాత నిన్ను నీవే పరిక్షించుకోవాలి.

**నిత్యత్వాన్ని గుర్తుంచుకొని వినాలి**

మనం ఎల్లప్పుడు నిత్య జీవితాన్ని మనసు నందుంచుకొనాలి. రాబోవు వాటిని గూర్చి ఏలాగు సిద్ధపడాలో దేవుని వాక్యం మనకు చెబుతున్నది. ఆయన వాక్యము వలననే మనకు తీర్పు జరుగును (యోహాను 12:48). అందువలన మన నిత్య జీవితాన్ని గూర్చి ఎల్లవేళల జాగ్రత్తగా యుండాలి!

- బిల్ విలియమ్స్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.